# రూపాయి

-పులిపాక కనకదుర్గ

''బాగా ముసురు పట్టింది. పెద్ద వానే పడేట్టుగా వుంది'' వుండుండి ఉరుముతున్న మేఘాల్ని చూసి తనలో తనే అనుకున్నాడు శివయ్య.

సన్నటి తుంపర మొదలవడంతో నడక వేగాన్ని మరింత పెంచాడు. అల్లంత దూరంలో గుడి కనిపించగానే మనసు కాస్త కుదుటపడింది శివయ్యకు.

అలవాటు ప్రకారం గుడిమెట్లు ఎక్కుతున్న శివయ్యకు మేఘాల మెరుపులో ఏదో మెరుస్తున్నట్టు అనిపించి ఒక్కక్షణం ఆగేడు. తీసుకున్న తరువాత తెలిసింది అదో రూపాయి బిళ్లని. ఆ కొత్త నాణెం తాలూకు మెరుపు శివయ్య కళ్లల్లో తళుక్కుమంది ఓ క్షణం. రూపాయి దొరికిన ఆనందంలో ఎనభైయేళ్ల శివయ్య శరీరం కాస్త వణికింది. దాంతోపాటే అతని మొహంలో కొత్త కాంతి తొణికిసలాడింది.

రూపాయిని చేతపట్టుకుని తను ఎప్పుడూ పడుకునే చోటికి వెళ్లి మరునాడు ఆ రూపాయితో ఏమేం కొనుక్కోవాలో నింపాదిగా ఆలోచించసాగాడు శివయ్య.

ఎక్కడ పుట్టాడో, అతని పుట్టు పూర్వోత్తరాలు ఏమిటో శివయ్యకే కాదు ఊళ్లో ఎవరికీ తెలియదు.

ప్రేమగా శివుడూ అని పిలిచే తల్లి మాత్రం లీలగా గుర్తుంది శివయ్యకు. ఆమె మరణం తరువాత ఊహ తెలిశాక రామాలయమే శివయ్య ప్రపంచమయింది. వయసుతోపాటు వినయాన్ని కూడా పెంచుకున్న శివయ్య ఊరివాళ్ల తల్లో నాలుక అయ్యాడు. ఎవరినీ ఇది కావాలి అని అడిగి ఎరుగని శివయ్య అవసరాలు చూసేది ఊరివాళ్లే. ఎవరింట పని దొరికితే ఆ పని చేయడం, వాళ్లు పెట్టిన దాంతో ఆ పూటకి కడుపు నింపుకోవడం అతని దినచర్య.

పెళ్లి చేసుకొమ్మని చెప్పేవారు లేక అలాగని పిల్లనిచ్చే దిక్కులేక అలాగే బ్రహ్మచారిగా ఉండిపోయాడు శివయ్య. వార్ధక్యం మీద పడడంతో చాలాకాలంగా గుడికే పరిమితమైపోయాడతను.

ఉదయాన్నే లేచి ఊరి చెరువు దగ్గర కాలకృత్యాలు తీర్చుకుని గుళ్లో పెట్టే ప్రసాదంతో సరిపెట్టుకుని పొద్దు గడపడం అతని నిత్యకృత్యం.

నిర్లిప్తంగా సాగిపోతున్న శివయ్య దైనందిన జీవితంలో ఓ రకమైన ఉత్సుకత చోటు చేసుకుంది. ఎన్నాళ్లగానో అణగారివున్న జిహ్వ చాపల్యం వేయి నాలుకలతో విజృంభిస్తుంటే మర్నాడు రూపాయితో ఏమేం కొనుక్కోవాలో ఆలోచించుకుంటూనే కలత నిద్రలోకి జారుకున్నాడు శివయ్య.

★★★

రూపాయికి ఇంకేమొస్తుంది? ఆలోచనలో పడ్డాడు శివయ్య. ఉన్నట్టుండి గోలగోలగా వినిపిస్తున్న అరుపులకు శివయ్య ఆలోచనలు చెదిరి పోయా యి. పెద్దగా అరుచుకుంటూ ఏదో బండి ముందర గుమిగూడుతున్నారు చాలామంది పిల్లలు. తను కూలబడింది, ఊరికి వున్న ఒకే ఒక బడి ముందర వున్న చెట్టుకిందని, బడి వదలగానే పిల్లలందరూ ఐస్‌క్రీం బండి చుట్టూ గుమిగూడు తున్నారని అర్థం కావడానికి కొద్దిక్షణాలు పట్టింది శివయ్యకు.

ఉదయాన్నే నిద్రలేచి ఆదరాబాదరా కాలకృత్యాలు తీర్చుకుని బాబాయ్ హోటల్‌వైపు అడుగులేశాడు శివయ్య.

అప్పుడెప్పుడో చాలా ఏళ్లక్రితం తిన్నాడు పలావు. సుభద్రమ్మగారింట్లో ఏదో శుభకార్యానికి తను కూడా ఓ చెయ్యి వేసి సాయపడినందుకు కడుపునిండా పలావు పెట్టిందా చల్లని తల్లి. జీవితంలో మొదటిసారి తిన్న పలావు రుచి ఇప్పటికీ నోరూరిస్తూనే వుంది. కానీ పలావు తినే అవకాశం తరువాత రానేలేదు.

హోటల్ నుండి వస్తున్న పలావు ఘుమఘుమలు శివయ్యను ఒక్కసారిగా వర్తమానానికి తీసుకువచ్చాయి. ఆత్రంగా హోటల్ కుర్రాడ్ని పిలిచి రూపాయి చేతిలో పెట్టి పలావు తెమ్మని పురమాయించాడు.

శివయ్యను పిచ్చివాడ్ని చూసినట్లు చూశాడా కుర్రాడు.

''ఏ కాలంలో వున్నావు ముసలయ్యా? రూపాయికి పలావుకాదుకదా సింగిల్ ఇడ్లీ కూడా రాదు. ఇరవై రూపాయలు తీసుకువస్తే పలావు తిందువుగానీ వెళ్లిరా'' అంటూ రూపాయిని తిరిగి శివయ్యకే ఇచ్చి మెడ పట్టుకుని నెట్టినంత పని చేశాడతను.

ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించింది శివయ్యను.

'ఏమిటి? రూపాయికి పలావురాదా? అప్పుడెప్పుడో గుళ్లో పూజారి కూతురు పెళ్లికి రూపాయి పెట్టి పలావుకంటే ఎక్కువ ఖరీదైన వస్తువులే తెచ్చాడు. ఇప్పుడా అమ్మాయి మనవలు, మనవరాళ్లను ఎత్తుకుని చల్లగా వుంది. మరిప్పుడు అదే రూపాయికి కనీసం పలావు కూడా రాకపోడం చాలా అన్యాయంగా వుంది' తనలో తనే మదనపడుతూ నడుస్తున్న శివయ్య - కమ్మని ఉల్లిపాయల వాసన ముక్కుపుటాలను తాకేసరికి ఒక్కసారి ఆగిపోయాడు.

రోడ్డువారగా ఓ చిన్నబండి పెట్టుకుని పెసరట్లు వేస్తున్నాడు ఎవరో ఒకతను. అల్లం, పచ్చి మిర్చి, ఉల్లిపాయలు బాగా దట్టించి వేస్తున్నాడు కాబోలు పెసరట్ల తాలూకు కమ్మని వాసన అక్కడంతా వ్యాపించి వుంది.

నెమ్మదిగా వెళ్లి బండి పక్కనే నిలబడ్డాడు శివయ్య. అక్కడంతా వచ్చిపోయే జనంతో రద్దీగా వుండడంతో శివయ్యను పట్టించుకునే నాధుడే లేకపోయాడు.

ఇందాక హోటల్లో జరిగిన అవమానంతో రూపాయికి పెసరట్టు అడగాలంటే జంకుగా అనిపించింది శివయ్యకు. కానీ పెసరట్టు నోరూరిస్తుంటే ధైర్యం చేసి ముందుకు నడిచాడు.

''ఇదిగో అబ్బీ! బాగా ఉల్లిపాయలువేసి ఓ

పెసరట్టు వేసెయ్యి'' బండతని చేతిలో రూపాయి పెడ్తూ అడిగాడు శివయ్య.

రూపాయిని చూడగానే పొయ్యిలో మంటలా మండిపడ్డాడు బండతను.

''ఏరా ముసలోడా! పొద్దుటే తాగిగానీ వచ్చావా? రూపాయికి నీకు పెసరట్టు కావాల్సి వచ్చిందా? ఎప్పుడన్నా పెసరట్టు తిన్న మొహమేనా?'' కోపంగా రూపాయిని శివయ్య మొహంమీదకు విసిరికొడ్తూ అరిచాడతను.

''రూపాయికి పెసరట్టు రాకపోతే రాదని చెప్పాలిగానీ మొహంమీదకు విసిరికొట్టాలా?'' తనలో తనే గొణుక్కుంటూ రూపాయిని తీసుకున్నాడు శివయ్య.

★★★

చేతిలో రూపాయిని దిగులుగా చూశాడు శివయ్య.

రూపాయికి ఎన్నాళ్లనుంచో తిందామనుకుంటే పలావు రాలేదు. కనీసం పెసరట్టుతో సరిపెట్టుకుందామనుకుంటే అదీ రాలేదు. రూపాయికి ఇంకేమొస్తుంది? ఆలోచనలో పడ్డాడు శివయ్య.

ఉన్నట్టుండి గోలగోలగా వినిపిస్తున్న అరుపులకు శివయ్య ఆలోచనలు చెదిరిపోయాయి.

పెద్దగా అరుచుకుంటూ ఏదో బండి ముందర గుమిగూడుతున్నారు చాలామంది పిల్లలు.


తను కూలబడింది, ఊరికి వున్న ఒకే ఒక బడి ముందర వున్న చెట్టుకిందని, బడి వదలగానే పిల్లలందరూ ఐస్‌క్రీం బండి చుట్టూ గుమిగూడు తున్నారని అర్థం కావడానికి కొద్దిక్షణాలు పట్టింది శివయ్యకు.

పిల్లలందరికీ చిన్నచిన్న కప్పుల్లో ఐస్‌క్రీం ఇస్తున్నాడు బండతను. చల్లగా, తియ్యగా వున్న ఐస్‌క్రీంను చప్పరిస్తూ ఆనందిస్తున్న పిల్లల్ని చూస్తుంటే తను కూడా ఐస్‌క్రీం తింటే బాగుంటుందని అనిపించింది శివయ్యకు. రూపాయికి కనీసం ఐస్‌క్రీం అయినా రాకపోతుందా అన్న ధైర్యంతో బండి ముందర నిలబడ్డాడు శివయ్య.

మౌనంగా బండి ముందర నిలబడ్డ శివయ్యను చూసి ''ఏం పెద్దయ్యా! నీక్కూడా ఐస్‌క్రీం పెట్టెయ్యమంటావా? తియ్యగా బాగుంటుందిలే'' ఆట పట్టిస్తున్న ధోరణిలో అడిగాడు బండతను.

బెరుకుగా రూపాయి అతని చేతిలో పెట్టి ఐస్‌క్రీం ఇవ్వమన్నట్లుగా చూశాడు శివయ్య.

''ఏం పెద్దాయనా! ఉత్త సత్తెకాలం మనిషిలా వున్నావే? రూపాయిని కళ్లచూసి ఎన్ని రోజులైంది? రూపాయికి ఐస్‌క్రీం కాదుకదా నాలిక గీసుకునే బద్ద కూడా రాదు. నెళ్లు'' రూపాయిని తిరిగి శివయ్య చేతిలో పెట్టి తరిమేశాడు బండతను.




ఒక్కసారిగా ఉక్రోషం చుట్టుముట్టింది శివయ్యను.

చేతిలో రూపాయి వంక కోపంగా చూశాడు.

దరిద్రపు రూపాయి. రోజూ దొరికే ప్రసాదాన్ని కూడా దొరక్కుండా చేసింది. అటు గుళ్లో ప్రసాదమూ అయిపోయిందీ ఇటు ఏదో తినాలన్న ఏ కోరికా తీరలేదు. ఆలోచనల్లోపడి తను గుడిమెట్లు ఎక్కుతున్న సంగతి గమనించలేదు శివయ్య.

పైమెట్టు మీదకు రాగానే చేతిలో రూపాయిని నేలకు కొట్టబోయి ఆగిపోయాడు.

ఎదురుగా చిరునవ్వులు చిందిస్తున్న రాములవారి విగ్రహాన్ని చూసి అప్రయత్నంగా చేతులు జోడించాడు.

''ఏం శివయ్యా! ఇదేమైనా బాగుందా? నా ఆలయం దగ్గర దొరికిన రూపాయిని నీవు సొంతం చేసుకోవడం మొదటి తప్పు. రూపాయి విలువ ఎంతగా దిగజారిపోయిందో తెలుసుకోకుండా ఖరీదైన కోరికలు కోరుకోవడం రెండో తప్పు. సరే ఇప్పటికైనా నా సొమ్ము నాకు చేర్చాలనుకోకుండా నేలకేసి విసిరి కొట్టాలనుకోవడం మూడో తప్పు. అవునా'' రాములవారు నిలదీస్తున్నట్లు అనిపించడంతో అప్రయత్నంగా రూపాయిని కళ్లకద్దుకున్నాడు.

ఎదురుగుండా వున్న స్వామివారి హుండీ తన కర్తవ్యాన్ని గుర్తు చేస్తుంటే అటువైపు నడిచాడు శివయ్య.

పురుషార్థానికి పనికిరాకుండా పోయిన రూపాయి కనీసం పుణ్యానికైనా అక్కరకొస్తుందన్న సంతోషంతో హుండీలో వేశాడా రూపాయిని శివయ్య.

★